
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 24 । జనవరి । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6.61.685లు, బంగారం 50 మిల్లీగ్రాములు, వెండి 23 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



పర్యావరణ పరిరక్షణ..

గజపతి జిల్లాలోని పలుచోట్ల అధికారులు పర్యటించారు. మొక్కలు నాటడంపై అవగాహన కల్పించారు. - IIలో▸



ఖగోళ ప్రయోగశాల..

మల్కన్‌గిరి నోడల్ ఎంఈ స్కూల్‌లో ఖగోళ ప్రయోగశాల ప్రారంభమైంది. పరికరాలు ఆకట్టుకున్నాయి. - IIలో▸

న్యూస్‌రీల్

కలిమెల సమితిలో ప్రేమజంట ఆత్మహత్య



సంఘటన స్థలంలో చెట్టుకు వేలాడుతూన్న మృతదేహాలు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి గంపకొండ పంచాయతీ తుమ్కి మడ్క గ్రామంలో గల అడవిలో ఓ ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం ఉదయం అడవికి వచ్చిన కొందరు వీరి మృతదేహాలను చూసి కలిమెల పోలీసులకు సమాచారం అందజేశారు. వివరాల్లోకి వెళితే.. పదియా పడియమి(20), బితికా మడ్కమి(18) అనే ఇద్దరు ప్రేమించుకుంటున్నారు. గత శనివారం నుంచి వీరిద్దరూ గ్రామంలో కనిపించలేదు. తల్లిదండ్రులు ఎక్కడ వెతికినా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. గ్రామస్తుల సాయంతో అడవిలో వెతకగా అక్కడ ఓ చెట్టుకు వేలాడుతూ ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. దీంతో ఐఐసీ చంద్రకాంత్ తండ తన సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాలను కిందకు దించి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబాలకు అప్పగిస్తామని తెలిపారు. వీరు మూడు రోజుల కిందటే చనిపోయి ఉంటారని భావిస్తున్నారు.

అడవిలో దంపతులు మృతి



మృతి చెందిన దంపతులు బలరాం గలయి, బాల గలాయి

కొరాపుట్: అడవిలో దంపతులు మృతి చెందిన ఘటన కొరాపుట్ జిల్లాలో చోటు చేసుకుంది. గురువారం కొరాపుట్ జిల్లా లమ్తాపుట్ సమితి నందపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గిరిపుట్ గ్రామానికి చెందిన బలరాం గలాయి (22), బల గలాయి (21) మృతి చెందారు. వీరిద్దరూ టీ దుకాణం నడుపుతుంటారు. కట్టెలు తేవడానికి అడవిలోనికి వెళ్లగా అక్కడ అడవి పందులను వేటాడడానికి పెట్టిన విద్యుత్‌తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. అడవికి వెళ్లిన వారు తిరిగి రాకపోవడంతో గ్రామస్తులు అడవిలో గాలించగా మృతదేహాలు దొరికాయి. నందపూర్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. విద్యుత్ తీగలు ఏర్పాటు చేసిన వేటగాళ్ల కోసం గాలిస్తున్నారు.

గంజాయి కేసులో.. నిందితుడి అరెస్ట్



పట్టుబడిన నిందితుడు త్రినాథ్ ఖిలో

మల్కన్‌గిరి: పారారీలో ఉన్న గంజాయి కేసు నిందితుడిని జిల్లాలోని బలిమెల పోలీసులు గురువారం పట్టుకున్నారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. కోరుకొండ సమితి కతాపల్లి గ్రామానికి చెందిన త్రినాథ్ ఖిలో అనే వ్యక్తి ఇంటిలో 150 కేజీల గంజాయిని బలిమెల పోలీసులు గతేడాది జనవరిలో పట్టుకుని అరెస్ట్ చేశారు. మార్చిలో బెయిల్‌పై బయటకు వచ్చి కోర్టుకు హాజారుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. త్రినాథ్‌పై కోర్టు అరెస్ట్ వారెంట్ జారి చేసింది. పోలీసులు అతని కోసం గాలించి చివరకు కుదుములగూమ్మ సమీపంలో ఉన్నాడనే పక్కా సమాచారంతో బుధవారం రాత్రి ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి త్రినాథ్‌ను పట్టుకుని అరెస్ట్ చేశారు. గురువారం కోర్టులో హాజరుపర్చామని బలిమెల ఐఐసీ దీరాజ్ పట్నాయక్ తెలిపారు.

శ్రీ మందిరం నిఘా కోసం వాచ్ టవర్లు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ మందిరం చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో పెడుతుండడం కలకలం రేపుతోంది. ప్రధానంగా శ్రీ మందిరం లోపలి దృశ్యాలు, కట్టడాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో తరచూ కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. శ్రీ మందిరం లోపలి దృశ్యాలు సాధారణంగా డ్రోన్ చిత్రీకరణతో ప్రసారం అవుతున్నట్లు గుర్తించారు. ఈ చర్య నివారణకు శ్రీ మందిరం వెలుపల చుట్టు పక్కల వాచ్ టవర్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందని న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. వాచ్ టవర్లపై సిబ్బంది నిఘాతో డ్రోన్ కవరేజిని గుర్తించడం సులభతరం అవుతుందని భావిస్తున్నారు. శ్రీ మందిరం నలు వైపులా ద్వారాల ప్రాంగణాల్లో తనిఖీలు ముమ్మరం చేస్తారు. సమగ్ర ఆలయ సముదాయం భద్రతా వ్యవస్థని పటిష్ట పరిచేందుకు యంత్రాంగం నడుం బిగించింది. అడుగడుగునా యాత్రికులు, భక్తులు, పర్యాటకుల కదలికను సీసీటీవీ కెమెరా అనుక్షణం కన్నేసి ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.

నేతాజీకి .. ఘనంగా నివాళి



పర్లాకిమిడి: సరస్వతీ శిశు విద్యామందిర్‌లో రక్తదాన శిబిరం



రాయగడ: నేతాజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సెయింట్ జేవియర్స్ విద్యార్థులు

పర్లాకిమిడి:

స్థానిక ఒకటోనంబరు వార్డు సుభాష్ నగర్‌లో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్, సురేంద్ర సాయి జయంతి వేడుకలు సరస్వతి శిశు విద్యామందిర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎస్పీ జితేంద్ర కుమార్ పండా ముఖ్యఅతిథిగా విచ్చేసి సుభాష్ చంద్రబోసు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దేవీమఠం మహంత రామానంద దాస్, అదనపు జిల్లా మెజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, డిప్యూటీ కలెక్టర్ కమలకాంత పండా, సరస్వతీ శిశు విద్యామందిర్ ప్రధాన అచార్యులు సరోజ్ కుమార్ పండా, రాఘవ సాహు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ నగర్ నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో రక్తదాన శిబిరం జరిగింది.

రాయగడలో..

రాయగడ: నేతాజీ శుభాష్ చంద్రబోస్ జయంతిని పురష్కరించుకుని స్థానిక ఆజాద్ హింద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాణిగుడఫారం వద్ద గల నేతాజీ విగ్రహానికి రాజ్యసభ మాజీ సభ్యులు నెక్కంటి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, ఎన్‌సీసీ కేడిట్‌లు పాల్గొన్నారు.

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో గురువారం సుబాష్ చంద్రబోస్ కూడలి వద్ద ఉన్న నేతాజీ విగ్రహానికి ఎస్పీ హెచ్.వినోద్ పటేల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.శ్రీనివాస్ రావు, పి.కేశవరావు, చిన్నారావు, శంకర్ పాణిగ్రహి తదితరులు పాల్గొన్నారు.



పర్లాకిమిడి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పట్టణంలో బైక్ ర్యాలీ



మల్కన్‌గిరిలో.. సుబాష్ చంద్రబోస్ కూడలి వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ వినోద్ పటేల్

జయపురంలో..

జయపురం: స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలు జయపురంలో పలుచోట్ల జరిగాయి. ఆయన జయంతిని పరాక్రమ దినంగా యువత జరుపుకుంది .గురువారం ఉదయం స్థానిక మహాత్మా గాంధీ రోడ్డు సంగీత హొటల్ కూడలి వద్ద గల నేతాజీ ప్రతిమకు జయపురం పూజ్య పూజ సంస్థ సభ్యులు పూల మాలలు వేశారు. పలు పాఠశాలల విద్యార్థులు నేతాజీ వేషధారణలతో అలరించారు. జయపురం మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్ర కుమార్‌మహంతి, వైస్ చైర్మన్ బి.సునీత పలు వురు కౌన్సిలర్లు నేతాజీకి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే పబ్లిక్ రైట్స్ అసోసియేషన్ జయపురం వారు జయనగర్ లో గల సుభాష్ పార్క్ ప్రాంగణంలో గత నేతాజీ సుభాష్ బోసు విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.



జయపురం: మహాత్మాగాంధీ రోడ్డులో నేతాజీ విగ్రహానికి నివాళులు



జయపురం: పిల్లలకు నేతాజీ సాహసాలు త్యాగాలు వివరిస్తున్న బాహిణీపతి తదితరులు

కొరాపుట్‌లో..

కొరాపుట్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఘనంగా జరిగింది. గురువారం ఉదయం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని బోస్ విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కొరాపుట్ కలెక్టర్ వీ.కీర్తి వాసన్, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో, కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక, కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటెందు రంజన్ శెఠి తదితరులు ఉన్నారు.



బోస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న ప్రముఖులు

సభలో అంతరాయాలు వద్దు: స్పీకరు

భువనేశ్వర్: రాష్ట్ర శాసన సభలో బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని స్పీకరు సురమా పాఢి హెచ్చరిక జారీ చేశారు. 17వ శాసన సభ మూడో విడత సమావేశాలు ఫిబ్రవరి నెల 13వ తేదీ నుంచి ఆరంభం కానున్నాయి. ఈ సందర్భంగా సభలో ప్రతిపక్షాలు ఎలాంటి అంతరాయం కలిగించరాదని, నిర్మాణాత్మక ప్రతిపాదనలు, చర్చలకు నిరభ్యంతరంగా అవకాశం లభిస్తుందని, సభా కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలిగించినా సహించేది లేదని స్పీకరు హెచ్చరించారు. ఈ విడత సమావేశాల్లో ప్రభుత్వ 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను సభలో ప్రవేశ పెడుతుంది. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల నిర్మాణాత్మక ప్రతిపాదనల్ని సభలో అనుమతిస్తారు. సభలో ప్రతిపక్షాలు రచ్చకు దిగితే సహించేది లేదన్నారు. సభా కార్యక్రమాలు ఆరంభానికి ముందు అఖిల పక్ష సమావేశం జరగనుంది. ఈ మేరకు తేదీ త్వరలో ప్రకటించడం జరుగుతుందన్నారు.

సమావేశాల షెడ్యూలు

శాసన సభ బడ్జెటు సమావేశాలు ఫిబ్రవరి నెల 13 నుంచి ఆరంభం అవుతాయి. తొలి రోజున గవర్నర్ ప్రసంగం కార్యక్రమం ఖరారు చేశారు. తదుపరి 2 రోజులు 14, 15 తేదీల్లో గవర్నరు ప్రసంగంపై చర్చ సాగుతుంది. ఈసారి సమావేశాల నిడివి 28 పని దినాలు ఉంటాయి. 3 రోజులు అధికారిక మరో 3 రోజులు ప్రభుత్వేతర వ్యవహారాలు కొనసాగుతాయి.

17న బడ్జెటు ప్రవేశం

ఫిబ్రవరి నెల 17న సభలో 2024-25 ఆర్థిక సంవత్సరపు బడ్జెట్‌ను ప్రవేశ పెడతారు. ఆర్థిక శాఖ బాధ్యతలు వహిస్తున్న ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి బడ్జెటుని ప్రవేశ పెడతారు. 20, 21వ తేదీల్లో బడ్జెట్‌పై సభలో చర్చిస్తారు. 22 నుంచి మార్చి నెల 6వ తేదీ వరకు వివిధ సలహా కమిటీలు నివేదికలు ప్రవేశ పెడతారు. 29న వ్యయ మంజూరు బిల్లు ప్రవేశ పెడతారు.

సీనియర్ పాత్రికేయుడు లక్ష్మీప్రసాద్ రథ్ కన్నుమూత



కొరాపుట్: సీనియర్ పాత్రికేయుడు లక్ష్మీ ప్రసాద్ రథ్ (67) మృతి చెందారు. గురువారం వేకువ జామున కొరాపుట్ జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. ఎయిర్ ఫోర్స్‌లో పదవీ విరమణ అనంతరం పాత్రికేయ రంగంలో ప్రవేశించారు. ప్రముఖ ఒడియా దిన పత్రికలు సంబాద్, సమాజ్ లలో సుదీర్ఘ కాలం పని చేశారు. లక్ష్మీప్రసాద్ మృతిపై పాత్రికేయ వర్గాలు సంతాపం ప్రకటించాయి.

27న జయపురం-అయోధ్యకు వోల్వో బస్సు



అయోధ్యకు వెళ్లే వోల్వో బస్సు

జయపురం: జయపురం నుంచి అయోధ్య వెళ్లేందుకు ఈ నెల 27న వోల్వో బస్సును ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కుంభమేళా వెళ్లేందుకు బస్సు వేయాలని పలు సంఘాలు సబ్ కలెక్టర్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తులు పంపాయి. ప్రజల కోరిక మేరకు ఈ నెల 27వ తేదీ నుంచి జయపురం, కొరాపుట్‌ల నుంచి అయోధ్యకు బస్సు వేస్తున్నారు. ఓఎస్ఆర్‌టీసీ చెందిన ఈ బస్సు 27 నుంచి ఫిబ్రవరి నెలాఖరు వరకు 5 పర్యాయాలు కొరాపుట్ నుంచి అయోధ్యకు రాకపోకలు సాగిస్తుంది. ఈ బస్సులో 51 సీట్లు ఉండగా ఇప్పటికే ప్రథమ ట్రిప్పు కోసం 50 టికెట్లు బుక్ అయ్యాయి. ఈ బస్సు కొరాపుట్‌లో బయల్దేరి జయపురం, నవరంగపూర్, పపడహండి, ఉమ్మరకోట్, రాయిఘర్, కాంకర్, రాయపూర్, ఉల్లాసపూర్, అంబికాపూర్, రాణీకుట్, వారణాశి, ప్రయోగరాజ్‌ల మీదుగా అయోధ్య చేరుతుంది. ఈ నెల 27వ తేదీ ఉదయం 9 గంటలకు కొరాపుట్‌లో బయల్దేరి జయపురం కొత్త బస్టాండ్‌కు 9.30 గంటలకు చేరి 9.35 గంటలకు బయలు దేరి మరునాడు 11.35 గంటలకు అయోధ్య చేరుతుంది. డౌన్ ట్రిప్‌లో ఈ నెల 31 వ తేదీన అయోధ్య నుంచి ఉదయం 9 గంటలకు బయల్దేరి కుంభ మేళా యాత్రికులతో ఫిబ్రవరి 1 వ తేదీన చేరుతుంది. అలాగే ఫిబ్రవరి 2వ తేదీన, 10న, 17న, 24 వ తేదీలలో కొరాపుట్ జిల్లా నుంచి యాత్రికులతో బయలుదేరి తిరిగి వారిని తీసుకు వస్తుంది.

బీజేపీ నేత ఇంటిలో 250 కిలోల గంజాయి లభ్యం



గంజాయితో పట్టుబడిన నిందితుడు మితున్ నాథ్

జయపురం: కొరాపుట్ జిల్లా బీజేపీ యువమోర్చ ఉపాధ్యక్షుడి ఇంటిలో జయపురం పట్టణ పోలీసులు గంజాయి పట్టుకున్నట్లు జయపురం పట్టణ పోలీసు అధికారి రమణీ రంజన్ దొలాయి తెలిపారు. మంగళవారం రాత్రి పట్టణ పోలీసులు పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో ప్రసాద్ రావు పేట రెండో లైన్‌లో జిల్లా బీజేపీ యువమోర్చ ఉపాధ్యక్షుడు ఎ.దుర్గ ఇంటీలో గంజాయి ఉందన్న సమాచారం రాగా.. పోలీసులు వెళ్లి సోదా చేశారు. అక్కడ 50 ప్లాస్టిక్ డబ్బాల్లో ప్యాకింగ్ చేసి ఉన్న గంజాయి పట్టుబడింది. మెజిస్ట్రేట్ సమక్షంలో గంజాయి తూయించగా 250 కిలోలు ఉన్నట్లు పోలీసు అధికారి వెల్లడించారు. దాడి జరిపిన సమయంలో ఆ ఇంటిలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర వాసి ఉన్నాడని వెల్లడించారు. అతడిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర గౌతమబుద్ధ జిల్లా రఘుపతి కంధార పోలీసు స్టేషన్ రామపుర గ్రామానికి చెందిన మితున్ నాథ్ అని వెల్లడించారు. అలాగే బీజేపీ నేత ఎ.దుర్గను పోలీసు స్టేషన్‌కు తీసుకు వచ్చి విచారించామని పోలీసు అధికారి దొలాయి వెల్లడించారు. నిందితుడు మితున్ నాథ్ గత 20వ తేదీ నుంచి ఇక్కడ అద్దెకు ఉంటున్నట్లు దుర్గ చెప్పారని పోలీసులు పేర్కొన్నారు. ఈ గంజాయి రవాణాలో ఇంకా ఎవరెవరు ఉన్నారో దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

మార్మోగిన సాయి నామం

- సత్యసాయి సమితుల రాష్ట్ర స్థాయి సదస్సు ప్రారంభం



సాయి చిత్రపటం ఊరేగింపు

రాయగడ: స్థానిక తేజస్వీ మైదానంలో గురువారం రాష్ట్ర స్థాయి సత్యసాయి సమితుల 49వ సదస్సు ప్రారంభమైంది. నలుమూల నుంచి వచ్చిన భక్తుల సాయి నామస్మరణతో పట్టణం మార్మోగింది. ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. సత్యసాయి సేవా సమితి రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ సత్య స్వరూప్ పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణ మూర్తి ఆధ్వర్యంలో పట్టణంలో భారీ ర్యాలీ జరిగింది. సాయిబాబా ఫొటోతో నిర్వహించిన ఈ ర్యాలీలో మహిళలు కలశాలను పట్టుకుని పాల్గొన్నారు. సాయి భక్తులు సాయి నామస్మరణం భజన కీర్తనలతో పాల్గొన్నారు. మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తులు వారి సంప్రదాయ దుస్తులతో ర్యాలీలా పాల్గొనడం విశేషం. ఇదిలా ఉండగా సాయి మందిరం వద్ద ఈ సందర్భంగా ఆధ్యాత్మిక పతాకావిష్కరణ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి కేంద్రాల నుంచి వచ్చిన మహిళలు, యువత, సాయి భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక ప్రసంగాలు, సత్య సాయి శత జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలియజేశారు.



కలశ యాత్రలో మహిళలు



సాయి భక్తుల భజన కీర్తనలు



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తుల వేషధారణలు

క్లుప్తంగా

రిపబ్లిక్ దినోత్సవానికి సన్నాహం



పేరెడ్‌ను ప్రాక్టీస్ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు

పర్లాకిమిడి: ఈ నెల 26న రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా స్థానిక గజపతి స్టేడియంలో పోలీస్ పదాతి దళాలు, వివిధ స్కూల్ విద్యార్థులు గురువారం పేరేడ్ ప్రాక్టీస్ చేశారు. ఈ ప్రాక్టీస్‌లో 3వ పోలీసు బెటాలియన్, ఎస్.కె.సి.జి కళాశాల ఎన్‌సీసీ, మహారాజా బాలుర ఉన్నత పాఠశాల, ఇతర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

పండ్ల వ్యాపారి ఇంట్లో బంగారం చోరీ

గార: రోడ్డుపై పండ్ల వ్యాపారం కోసం వెళ్లిన కుటుంబ సభ్యులు రాత్రి తిరిగి ఇంటికి వచ్చేసరికి వెనుక తలుపులు తెరిచే ఉన్నాయి. అనుమానం వచ్చి బీరువా తీసేందుకు తాళాల కోసం వెతకగా దొరకలేదు. విరగ్గొట్టి చూస్తే బంగారం మాయమైంది. శాలిహుండం ఎస్సీ కాలనీలో ఈ చోరీ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాలిహుండంకు చెందిన ఉరజాన రమణమ్మ, ఆదినారాయణ దంపతులు రోడ్డుపై పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఎప్పట్లాగే భైరి, సింగుపురం ఫ్లైఓవర్ కింద పండ్ల వ్యాపారం ముగించుకొని బుధవారం రాత్రి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపు తీసి చూసేసరికి వెనుక తలుపు తెరిచి ఉంది. తాము వేయలేదని భావించి.. తర్వాత తన మెడలో ఉన్న హారం బీరువాలో పెడదామని చూశారు. తాళం లేకపోవడంతో బీరువాను పగలగొట్టి చూసేసరికి అప్పటికే బంగారం లేకపోవడంతో పోలీసులుకు ఫిర్యాదు చేశారు. గురువారం ఉదయం క్లూస్‌టీం, సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ రెల్ల జనార్ధనరావులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులతో పాటు పొరుగింటి వారిని కూడా పోలీసులు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఉదయం 50 తులాలు బంగారం అన్న ఫిర్యాదు.. సాయంత్రమయ్యేసరికి 14.5 తులాలు మాత్రమే పోయినట్టు కేసు నమోదు జరిగింది. కుటుంబ కలహాలు కూడా చోరీకి కారణమై ఉండవచ్చని గ్రామస్తులు చెబుతున్నారు. కాగా, వాస్తవంగా 9.5 తులాలు మాత్రమే పోయిందని, ఆ దిశగా దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు చెబుతున్నారు.

ఆస్పత్రిలో చోరీ

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఇలిసిపురం జంక్షన్ బొందిలీపురం వెళ్లే రోడ్డులో మంచు ఐకేర్ ఆస్పత్రిలో చోరీ జరిగినట్లు రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావు తెలిపారు. బుధవారం రాత్రి తలుపులు విరగ్గొట్టి గుర్తు తెలియని వ్యక్తులు లోపలకు చొరబడ్డారని, క్యాబిన్ డెస్క్ లో ఉన్న రూ.లక్ష నగదు, హార్డ్ డిస్క్ పట్టుకుపోయినట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ వాసుదేవరావు గురువారం ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నాటుతుపాకీ స్వాధీనం

మెళియాపుట్టి: మండలంలోని భరణికోట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకీతో సంచరిస్తున్నట్లుగా సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేసి ఇద్దరిని బుధవారం రాత్రి అరెస్ట్ చేశారు. కోదు కొళిగాం గ్రామానికి చెందిన కోరాడ గిరి, పలాస మండలం లొత్తూరు గ్రామానికి చెందిన భుజంగరావు (అలియాస్ రాజు)ను గురువారం కోర్టులో హాజరు పరచి పాతపట్నం సబ్ జైలుకు తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గిరిజన రైతులతో మాట్లాడుతున్న దేవిగిరి అటవీ శాఖ అధికారులు



గురండిలో రఘురాం వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వైజ్ఞానికులు సుభాష్ చంద్ర పాత్రో, అటవీ శాఖ అధికారి సాహు



అటవీ శాఖ పరిధిలోకి రాని భూముల్లో చెట్లు పెంచడాన్ని ప్రోత్సాహిస్తున్న అటవీ శాఖ అధికారులు

పర్లాకిమిడి: గ్రీన్ గజపతిలో భాగంగా అటవీశాఖ పరిధికి బయట మొక్కలు పెంచడాన్ని ప్రోత్సాహిస్తూ గజపతిలో గురండి, రాయఘడ సమితిల్లో పలువురు అధికారులు గురువారం పర్యటించారు. గురండిలో రైతు సంజయ్ జెన్నా బంజరు భూమిలో, చెరువు గట్టుపై, గుట్టలపై నాటిన మొక్కలను సీనియర్ సైంటిస్టు సుభాష్ చంద్ర మహాపాత్రో, దేవగిరి రేంజ్ అటవీ శాఖ అధికారి బ్రహ్మానంద సాహు పరిశీలించారు. అటవీ శాఖ పరిధి కాకుండా సొంత పొలాలు, పోరంబోకు భూముల్లో మొక్కలు నాటేందుకు అటవీశాఖ అధికారులు ప్రోత్సాహిస్తున్నారన్నారు. దీనిపై జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రైతులతో సమావేశమయ్యారు. మొక్కలు ఎక్కువగా పెంచడం వల్ల పర్యావరణం కాపాడుకోగలుగుతామని దేవిగిరి రేంజ్ అధికారి బ్రహ్మానంద సాహు అన్నారు. పలు టేకు మొక్కలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కలు పెంచడం ద్వారా బయోడైవర్సిటీ కాపాడటంతోపాటు, ఆర్థికంగా నిలదొక్కుకుంటారని అని డీఎఫ్ఓ ఎస్.ఆనంద్ అన్నారు. ఈ సమావేశానికి గుమ్మా, రాయఘడ, గుసాని, కాశీనగర్, నువాగడ సమితుల నుంచి గిరిజన రైతులు పాల్గొన్నారు.

వైభవంగా స్కూల్ వార్షికోత్సవం



ప్రారంభ గీతాలు పాడుతున్న విద్యార్థులు

జయపురం: విద్యార్థులు గుణాత్మక విద్య అభ్యసించి ఉన్నతస్థాయికి ఎదగాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం రింగ్‌రోడ్డు లొగల సెయింట్ జేవియర్స్ ఉన్నత పాఠశాల 4 వ వార్షికోత్సవంలో బుధవారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు.ముఖ్యవక్తగా అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియ ఉపాధ్యక్షుడు, ఒడిశా అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.శ్రీనివాస పట్నాయిక్ మాట్లాడుతూ విద్యార్థుల భవితను బంగారం చేయాలనే లక్ష్యంతో సెయింట్ జేవియర్స్ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో నిర్వహించిన నృత్య, నాట్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.



డ్యాన్స్ చేస్తున్న ఉపాధ్యాయినులు



డ్యాన్స్‌లు చేస్తున్న చిన్నారులు

ఖగోళ ప్రయోగశాల ప్రారంభం



పాఠశాల రికార్డు చూస్తున్న ఎంపీ బోలభద్ర మాఝి ఇతర అతిథులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి సమితి కేంద్రంలో ఉన్న నోడల్ ఎంఈ స్కూల్‌లో గురువారం నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్రమాఝి చేతులమీదుగా ఖగోళ శాస్త్ర ప్రయోగశాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఖగోళ శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని ఆకాంక్షించారు. పలు పరికరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, మల్కన్‌గిరి అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా విద్యాశాఖ అధికారి విశ్వనాథ్ సాహు, మల్కన్‌గిరి డిప్యూటీ కలెక్టర్ అశోక్ చక్రవర్తి, ఎంపీ ప్రతినిధి సంజాయ్ సర్కార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్ర ఖండపాణి తదితరులు పాల్గొన్నారు.



టెలిస్కోప్ ద్వారా చూస్తున్న ఎంపీ బోలభద్ర మాఝి

చంద్రబాబూ.. ఎస్సీ విభజన జోలికి పోవద్దు



మాట్లాడుతున్న చింతా మోహన్

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రంలో ఎస్సీ విభజన జోలికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పోకూడదని, కాదని ముందుకెళ్తే దళితులను, ఓబీసీలను కలుపుకొని పోరాటం చేస్తానని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ అన్నారు. శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వార్థ రాజకీయాల కోసం ఎస్సీలను వాడుకోవద్దని చంద్రబాబుకు సూచించారు. గాంధీ, నెహ్రూ, ఇందిరా గాంధీ, అంబేడ్కర్ వంటి వారి వల్ల ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం, రిజర్వేషన్లు వచ్చాయన్నారు. ఎస్సీల వర్గీకరణపై మిశ్రా నేతృత్వంలో వన్ మ్యాన్ కమిషన్ వేశారని, అతనికి దళితుల స్థితిగతులపై కనీస అవగాహన కూడా లేదన్నారు. చంద్రబాబు ఆలోచనా విధానం తప్పని, ఈ కమిషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీ రాష్ట్ర విభజనకు, దళిత విభజనకు చాలా దగ్గర సంబంధం ఉందన్నారు. దళిత విభజన కోసమే రాష్ట్ర విభజన జరిగిందన్నారు. రాష్ట్ర విభజన వల్ల ఏం సాధించారని ప్రశ్నించారు. అమరావతిలో కట్టడాల కోసం హడ్కో సంస్థ నుంచి సీఆర్‌డీఏకు రూ.11వేల కోట్లను 15 ఏళ్ల కాలపరిమితితో 9 శాతం వడ్డీకి అప్పు తెచ్చారని, ప్రతి మూడు నెలలకు వడ్డీ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. అసలు అప్పులు చేసి అమరావతిని నిర్మించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం ఇటీవల కేంద్రం రూ.11,400 కోట్లు కేటాయించిందని, ఈ నిధులు ఏమాత్రం సరిపోవన్నారు.

నేడు లేబర్ కోర్టులో విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో 34 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తొలగింపుపై శ్రీకాకుళం డేఅండ్ నైట్ జంక్షన్ వద్ద ఉన్న లేబర్ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం విచారణ జరగనుంది. డిసెంబర్ 31న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించగా, జనవరి 2న వీరంతా లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని, 151 జీవో మేరకు కనీసం మూడేళ్లు కొనసాగించాలని, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్నా వర్సిటీ అధికారులు స్పందించలేదని, పాలక మండలిలో సైతం ప్రస్తావన లేకుండా తొలగించారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 9న మొదటిసారి విచారణ నిర్వహించారు. లేబర్ కోర్టు అసిస్టెంట్ కమిషనర్ హాజరై ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, ఏజీఎస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (గుంటూరు), వర్సిటీ తరపున అధికారులు కాకుండా కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో కూడిన సిబ్బంది హాజరయ్యారు. లేబర్ కోర్టు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానాలు సరైన సమాధానం చెప్పకపోవటంతో వర్సిటీ తరపున సంబంధిత అధికారి హాజరు కావాలని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మరోసారి విచారణ జరగనుంది.

కల్లుగీత కార్మికుల మద్యం షాపులకు నేడు డ్రా

శ్రీకాకుళం క్రైమ్ : నూతన మద్యం పాలసీలో భాగంగా గతేడాది అక్టోబరు 14న జిల్లాలో 158 మద్యం షాపులకు ప్రయివేటు వ్యక్తుల టెండర్లను కోరుతూ ఎక్సైజ్ శాఖ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా నిర్వ హించిన సంగతి తెలిసిందే. తాజాగా కల్లుగీత కార్మికులకు 16 మద్యం దుకాణాల కేటాయింపునకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సమక్షంలో శుక్రవారం డ్రా నిర్వహించనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు గురువారం పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తుదారుల సమక్షంలో ఉదయం 9:30 గంటలకు ప్రక్రియ మొదలు కానుందని చెప్పారు.

కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దీక్ష



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : కార్గో ఎయిర్‌పోర్టుకు వ్యతిరేకంగా దశల వారీ పోరాటాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ నాయకుడు మద్దిల రామారావు అన్నారు. కార్గో ఎయిర్‌పోర్టుకు బలవంతపు భూసేకరణ ఆపాలని, సముద్ర తీర ప్రాంతాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టవద్దని డిమాండ్ చేస్తూ పోరాట కమిటీ, వామపక్షాల ఆధ్వర్యంలో కార్గో ఎయిర్‌పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు ఎందుకు కట్టబెడుతున్నారో సమాధానం చెప్పాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు పేరిట మందస, వజ్రపు కొత్తూరు మండలాల్లోని 20 గ్రామాల్లో 1400 ఎకరాల భూమిని ప్రజల వద్ద నుంచి బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఈ చర్యలు మానుకోకపోతే, ప్రజల మద్దతుతో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసన దీక్షలో సీపీఎం నాయకులు బి.కృష్ణమూర్తి, పోరాట కమిటీ నాయకులు లండ రామస్వామి, జోగి అప్పారావు, చిత్త గున్నయ్య, మర్ల సంతోష్, తెప్పల గున్నయ్య, నల్ల పరుశురాం, గుంటు లోకనాథం, డి.సురేష్, డి.దానయ్య, ఎస్.రాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహన్ రావు, జి.సింహాచలం, టి.అజయ్‌కుమార్, ప్రజాసంఘాల నాయకులు మామిడి తులసయ్య, మామిడి మాధవరావు, హేమారావు చౌదరి, నల్ల హడ్డి, వంకల మాధవరావు, పి.కుసుమ, కృష్ణవేణి, నీలంరాజు, భాస్కరరావు, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు పట్టాలపై వ్యక్తి మృతదేహం



పూండి వద్ద పట్టాలపై మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం గుర్తు తెలియ వ్యక్తి మృతదేహం రైలుపట్టాలపై కనిపించింది. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, నెరిసిన జుత్తుతో పాటు నలుపుగళ్ల షర్టు, ఆకుపచ్చ లుంగీ ధరించి ఉన్నట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. పొట్ట భాగం పెద్దగా ఉందని వివరించారు. రైలు కిందపడి చనిపోయాడా, లేక ఇంకేమైనా జరిగిందా తెలియాల్సి ఉందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. వివరాలు తెలిసినవారు 94406 27567 నంబరుకు సమాచారం అందిచాలని కోరారు.

మహిళ ఆత్మహత్య

ఎచ్చెర్ల క్యాంపస్ : చిలకపాలెంలో సప్పకుమారి(55) అనే మహిళ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శ్రీకాకుళం చిన్న బరాటం వీధికి చెందిన ఈమె భర్త మృతి చెందడంతో చిలకపాలెంలో ఉంటున్న తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. తల్లిదండ్రులు సైతం కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. పెద్దకుమారుడు సంతోష్ బెంగళూరులో, చిన్న కుమారుడు రాజేష్ పాతపట్నంలో ఉద్యోగాలు చేస్తున్నారు. రాజేష్ గురువారం సాయంత్రం ఇంటికి చేరుకునే సరికి తల్లికి ఫ్యాన్‌కు వేలాడుతూ విగతజీవిగా కనిపించడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కారణంగా మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. అనారోగ్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు నోట్ రాసి మృతి చెందినట్లు సమాచారం. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తామరాపల్లిలో విషాదం

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లికి చెందిన ఎస్.రాంబాబు (30) గురువారం ఉదయం నాతవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మ్యాక్సీ వ్యాన్ క్లీనర్‌గా పనిచేస్తున్న రాంబాబు నాతవలస వద్ద దిగి రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న భార్య మహాలక్ష్మి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

బావిలో యువకుడి మృతదేహం

బూర్జ: మండలంలోని మదనాపురం గ్రామానికి కూతవేటు దూరంలో పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారి పక్కన మంచినీటి బావిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. వీఆర్వో లక్ష్మినారాయణ సమాచారం మేరకు పోలీసు లు వెళ్లి పరిశీలించి పాలకొండ అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. వారు మృతదేహాన్ని బయటకు తీశారు. ఎస్సై ఎం.ప్రవళ్లిక కేసు నమోదు చేశారు. మృతుడు కొంత కాలంగా మతి స్థిమితం లేకుండా చుట్టు పక్కల గ్రామాల్లో సంచరించేవాడని, దాహం తీర్చుకోవడానికి వచ్చి బావిలో పడిపోయి ఉంటాడని భావిస్తున్నారు. వివరాలు తెలిసిన వారు 63099 90855 నంబరుకు తెలియజేయవచ్చని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

సారవకోట: మండలంలోని మాళువ గ్రామానికి చెందిన విష్ణు దాలయ్య(55) గురువారం మద్యం మత్తులో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. దాలయ్య మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబసభ్యులు నిలదీశారు. దీంతో ఇంట్లో కూరగాయలు పండించేందుకు వినియోగించే పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి పాతపట్నం సీహెచ్‌సీ తరలించా రు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దాల య్య భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు. దాలయ్యకు కుమారుడు హేమసుందరరావు, కుమార్తె ఉష ఉన్నారు.

బైక్‌పైకి దూసుకొచ్చిన ఆర్టీసీ బస్సు



గాయపడిన రెల్ల వసంత్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కేటీ రోడ్డులో గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనచోదకుడి పైకి దూసుకెళ్లింది. పలాస డిపో పల్లె వెలుగు బస్సు (ఏపీ30జెడ్ 0044) గొప్పిలి నుంచి పలాస వస్తుండగా విద్యుత్ ఈఆర్ఓ కార్యాలయం అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వ్యక్తి మొగిలిపాడుకు చెందిన ఆధ్యాత్మికవేత్త రెల్ల వసంత్‌గా గుర్తించారు. ఎడమకాలుపై టైరు వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సిబ్బంది తారకేశ్వరరావు, వెంకటరావులు ప్రథమ చికిత్స అందించి పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పాత బస్సు కావడంతో కంట్రోల్ కాలేదని సమాచారం.

పోయాం..మోసం!

- కూటమి ప్రభుత్వ హయాంలో దగాపడిన నిరుద్యోగులు
- అరసవల్లి ఆలయంలో 48 మంది దినసరి వేతనదారుల నుంచి అక్రమంగా డబ్బుల వసూళ్లు
- రాష్ట్ర కమిషనర్ తాలూకా అంటూ వసూళ్లకు పాల్పడిన ఓ రిటైర్డ్ ఉద్యోగి
- ఇటీవల కమిషనర్‌కు ఇవ్వాలంటూ రూ.3 లక్షల వరకు కలెక్షన్లు
- తీరా కమిషనర్ బదిలీ కావడంతో తీవ్ర ఆందోళనలో దినసరి వేతనదారులు





అప్పటి ఈఓ చంద్రశేఖర్‌కు విన్నవించుకుంటున్న దినసరి వేతనదారులు (ఫైల్)

అరసవల్లి:

గత ప్రభుత్వ హయాంలో ఒక్క రూపాయి కూడా లంచాలివ్వకుండా రాజకీయాలకు అతీతంగా ఉద్యోగాలు పొందిన ఆ నిరుద్యోగులు నేడు ఓ రిటైర్డ్ ఉద్యోగి (గ్రేడ్-1 ఈఓ) పుణ్యమా అని మోసపోయి దిక్కుతోచని దుస్థితిలో ఉన్నారు. ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి అవసరానికి తగిన రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో సుమారు 48 మంది నిరుద్యోగులకు దినసరి వేతనదారులుగా గత ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. అయితే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి 11 నెలలుగా వీరికి దినసరి వేతనాలు ఇవ్వడం లేదు. వీరి బాధలను అవకాశంగా తీసుకుని వీరందరినీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా మార్చేలా ప్రత్యేక ఆర్డర్ కోసం దేవదాయ శాఖ కమిషనరేట్‌లో 'పని' చేయించుకుని వస్తానంటూ ఆలయంలో పనిచేస్తున్న ఓ రిటైర్డ్ ఉద్యోగి బాధితులకు 'ఆర్డర్' ఆశ చూపించి డబ్బులు రూ.లక్షల్లో వసూలు చేశారు.

గతంలోనూ ఆధిపత్య ప్రదర్శన..

కొద్ది నెలల కిందట ఆలయంలో పనిచేసిన ఇద్దరు రెగ్యులర్ ఉద్యోగుల ద్వారా ఇలాగే డబ్బులు వసూలు చేసినట్లుగా సృష్టించి వాళ్లిద్దరిపై సస్పెండ్ వేటు పడేలా అప్పటి ఈఓ చంద్రశేఖర్‌పై ఒత్తిడి తెచ్చి ఆలయం నుంచి పంపించేసేలా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించినట్లుగా అప్పట్లో వార్తలొచ్చాయి. మళ్లీ ఇప్పుడు రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ పేరు చెప్పి మరోసారి బాధిత దినసరి వేతనదారుల నుంచి తొలి విడతగా రూ.3 లక్షల వరకు వసూళ్లు చేయించి కమిషనర్‌కు ఇవ్వాలంటూ చెప్పి అరసవల్లి కూడలిలో ఉన్న ఓ హోటల్‌లో స్వయంగా అతడే అందజేసినట్లుగా విశ్వసనీయ సమాచారం. అయితే ఇచ్చాడా లేదా అన్న సందేహాలు కూడా బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి. తాజాగా జరిగిన బదిలీల్లో దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణకు బదిలీ కావడంతో ఆయన బంధువుగా చలామణి అవుతున్న సదరు రిటైర్డ్ ఉద్యోగి వ్యవహారంపై దినసరి వేతనదారులంతా ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కమిషనర్ తాలూకా అంటూ..

జిల్లాకు చెందిన ఎస్.సత్యనారాయణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్‌గా పనిచేసిన సంగతి తెలిసిందే. అయితే అదే సామాజిక వర్గానికి చెందిన ఓ రిటైర్డ్ ఈఓ.. కమిషనర్ తన దగ్గరి బంధువంటూ అరసవల్లి ఆలయంలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఈ రిటైర్డ్ ఉద్యోగి జీతం రూ.25 వేలకు ఫిక్స్ చేస్తూ కమిషనరేట్ నుంచి ఆర్డర్ తెప్పించుకున్నారు. కమిషనర్ పేరు చెబుతూనే అటు ఆలయ ఈఓలకు ఇటు ఉద్యోగుల పైన నిత్యం జులుం చెలాయిస్తూ తన దొంగ బిల్లులు ఆమోదమయ్యేలా బెదిరింపులకు పాల్పడుతున్నాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవలే వివిధ దేవాలయాల నుంచి అరసవల్లికి ఒక సూపరింటెండెంట్, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ బదిలీపై వచ్చారు. అయినప్పటికీ రిటైర్డ్ ఈఓగా రూ.70 వేల వరకు నెల పింఛన్ పొందుతున్న అతడికి నెలసరి జీతంగా రూ.25 వేలు ఇచ్చి మరీ ఎలా కొనసాగిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈయనకు ఇచ్చే నెలసరి వేతనంతో ఓ ముగ్గురు దినసరి వేతనదారుల కింద కంప్యూటర్‌తో కూడిన విధులు నిర్వర్తించే అవకాశముంది. ఇప్పటికైనా ఈ రిటైర్డ్ ఉద్యోగి వ్యవహారాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ట్రాన్స్‌ఫర్ అయితే నేనేం చేస్తా..

రిటైర్డ్ ఉద్యోగి వద్ద మంగళవారం కొందరు బాధితులు సమస్యను ప్రస్తావిస్తే 'కమిషనర్ ట్రాన్స్‌ఫర్ అయితే నేనేం చేస్తాను...డబ్బులు మరిచిపోవడమే...' అంటూ దాటవేస్తూ పోయాడని బాధితులు గోడు వెళ్లగక్కుతున్నారు. ఇప్పుడు ఏం చెయ్యాలో తెలియక బాధితులు డైలమాలో పడ్డారు. విజయవాడలో పనిచేయిస్తామని చెప్పి ఇప్పటికే రెండుసార్లు మోసపోయిన తమకు స్థానిక నాయకులు న్యాయం చేస్తారేమో అని ఎదురుచూసినప్పటికీ కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, అచ్చె న్నాయుడులు సైతం ఈ బాధితులపై ఏమాత్రం కరుణ చూపడం లేదు. దీంతో ఈ రథసప్తమి ఉత్సవానికి ముందే బాధిత దినసరి వేతనదారులంతా రోడ్డెక్కనున్నట్లు సమాచారం.



ఆదిత్యుని ఆలయం

క్లుప్తంగా

వృద్ధురాలి మెడలో పుస్తెల తాడు చోరీ



బాధిత వృద్ధురాలు పేర్ల లక్ష్మి

రాజాం సిటీ: ఇటీవల పట్టపగలు దొంగతనాలు అధికం కావడంతో రాజాం ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టపగలు ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ రాజాంలో కలకలం రేపింది. ఈ సంఘటనతో రాజాం ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. దీనికి సంబంధించి ఎస్సై వై.రవికిరణ్ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. స్థానిక బాబానగర్ రెండవ లైన్‌లో పేర్ల లక్ష్మి అనే 63 ఏళ్ల వృద్ధురాలు నివాసం ఉంటోంది. మధ్యాహ్నం 1.30గంట సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని గమనించిన ఆగంతుకుడు ఆమె మెడలో రెండు తులాల పుస్తెలతాడును అపహరించుకుపోయాడు. వెంటనే ఆమె కేకలు వేసింది. ఏం జరిగిందోనని చుట్టుపక్కలవారు వచ్చేసరికి ఆగంతుకుడు పరారయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు పోలీసులకు తెలపడంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఘటనపై ఆరాతీసి పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. క్లూస్‌టీమ్‌కు సమాచారం అందించడంతో రాత్రి వారు వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఈ ఘటనకు సంబంధించి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట సమీపంలో గురువారం గడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. పొలాల్లో గడ్డిని ట్రాక్టర్‌కు ఎక్కించిన తరువాత రోడ్డు ఎక్కుతుండగా బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో ప్రమాదం తప్పింది. ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదు. ట్రాక్టర్ బోల్తాపడడంతో వేపాడ-సోంపురం రహదారిలో గురువారం రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. సమాచారం మేరకు వల్లంపూడి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాకపోకలను పునరుద్ధరించారు.

బస్సును ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు




ఘటనాస్థలంలో క్షతగాత్రుడు దిలీప్ కుమార్

పాలకొండ రూరల్: మండలంలోని అట్టలి గ్రామం వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ద్విచక్రవాహన చోదకుడు తీవ్రగాయాలపాయ్యాడు. దీనిపై పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు పార్వతీపురం మన్యం జిల్లాలోని బందలుప్పి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్ అల్ట్రాటెక్ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. సొంత పనులపై ద్విచక్ర వాహనంపై పాలకొండ వస్తుండగా పార్వతీపురం వైపు వెళ్తున్న మణికంఠ (ప్రైవేటు) బస్సును ఢీకొట్టాడు. తన ద్విచక్ర వాహనం ముందు ఉన్న ఆటోను తప్పించబోయి మలుపు వద్ద బస్సును ఢీకొట్టడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని 108 వాహనంలో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీసి కేసు నమోదు చేశారు. పాలకొండ నుంచి వీరఘట్టం వయా పార్వతీపురం వెళ్లే మార్గంలో తంపటాపల్లి- తుమరాడ, అట్టలి-పనుకువలస గ్రామాల మధ్య ఉన్న మలుపులు నిత్యం ప్రమాదాలకు నెలవుగా మారుతున్న క్రమంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు 'జనరేట్ యువర్ బిజినెస్ ఐడియా (జీవైబీ)' అనే అంశంపై ఐదు రోజుల పాటు నిర్వహించే అవగాహన సదస్సును స్థానిక జనశిక్షణ సంస్థాన్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం ప్రారంభించారు. వ్యాపారాన్ని ఎంచుకోవడం, ప్రారంభించడం, వృద్ధిచేసుకునే అంశాలపై అవగాహన కల్పిస్తామని సంస్థ జిల్లా మేనేజర్ జి.ప్రశాంత్ కుమార్, సంస్థాన్ డైరెక్టర్ వడ్డాది హరీష్ తెలిపారు. సంకల్ప్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో ట్రైనర్‌గా అనిల్‌కుమార్ వ్యవహరిస్తారు. ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పూర్తి వివరాల కోసం సెల్: 94929 27844 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

గణతంత్రవేడుకలకు కంటకాపల్లి సర్పంచ్‌కు ఆహ్వానం



సర్పంచ్ కృష్ణ

కొత్తవలస: ఢిల్లీలో ఈ నెల 26న జరగనున్న గణతంత్ర వేడుకలకు హాజరుకావాలని మండలంలోని కంటకాపల్లి గ్రామ సర్పంచ్ పి.కృష్ణకు ఆహ్వానం అందింది. గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో మంజూరైన ఇంటింటి కుళాయిల నిర్వహణలో చిత్తశుద్ధికి కేంద్రం మెచ్చింది. ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజినీర్ హారే రామ నాయక్ నుంచి ఆహ్వాన ఉత్తర్వులు అందాయని, రానుపోను విమాన టికెట్లు, ఢిల్లీలో వసతి సౌకర్యాలను కల్పించినట్టు సర్పంచ్ తెలిపారు.

- బానాది ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి ధిక్కార ధోరణి
- సర్పంచ్, వైస్ సర్పంచ్, కార్యవర్గానికి వేధింపులు
- ఎస్.కోట టీడీపీలో ఓ వర్గం నాయకుల అండదండలు
- క్రమశిక్షణారాహిత్యంపై కలెక్టర్ ఆదేశాలూ వృథాప్రయాస
- విశాఖ ఎంపీ భరత్ సిఫారసుతో జిల్లా అధికారుల ఆదేశాలు బుట్టదాఖలు
- టీడీపీ నాయకుల కోసం గ్రామ సచివాలయం తరలింపు
- బానాది గ్రామసచివాలయం, ఆర్‌బీకే భవనాల మార్పిడి వివాదానికి ఆజ్యం



నా సచివాలయం.. నా ఇష్టం!

సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఆయనొక ఒక గ్రామ సచివాలయానికి ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి! కానీ కలెక్టర్ సహా జిల్లా అధికారులనెవర్నీ లెక్కచేయరు! కేవలం వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచారనే అక్కసుతో ఆ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యవర్గంపై రగిలిపోతున్న ఓ వర్గం టీడీపీ నాయకులకు ఆయనే బ్రహ్మాస్త్రం. వారిని సంతృప్తి కోసం సచివాలయ వ్యవస్థకే తూట్లు పొడుస్తున్న ఘనాపాఠి ఈ అధికారి. గత ఏడు నెలల్లో ఒక్కసారి కూడా గ్రామసభ నిర్వహించలేదు. పంచాయతీ రికార్డులు ఎక్కడ భద్రంగా ఉంచారో ఆయనకే ఎరుక! ఇదేమిటని ప్రశ్నిస్తే మద్యం తాగొచ్చి తమపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ సదరు మహిళా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు ఏకంగా కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక (స్పందన)లో ఫిర్యాదు చేసినా అరణ్యరోదనే అయ్యింది. క్రమశిక్షణారాహిత్యం దృష్ట్యా ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన జిల్లా కలెక్టరే మళ్లీ వాటిని రద్దు చేస్తూ పునరుత్తర్వులు ఇవ్వాల్సి వచ్చిందంటే కూటమి ప్రభుత్వంలో అధికార వ్యవస్థ పరిస్థితి ఏవిధంగా ఉందో ఊహించవచ్చు. శృంగవరపుకోట నియోజకవర్గంలో ఓ వర్గం టీడీపీ నాయకుల అండదండలు, విశాఖ ఎంపీ భరత్ సిఫారసులు ఉండగా జిల్లా పంచాయతీ అధికారి కాదుకదా జిల్లా కలెక్టర్ కూడా తనను ఏమీ చేయలేరని ఆయన ప్రత్యక్షంగా, పరోక్షంగా సందేశమిస్తున్న సదరు పంచాయతీ కార్యదర్శి... ఇటీవల వేపాడ మండలం బానాది గ్రామ సచివాలయం తరలింపు వివాదానికి ఆజ్యం పోశారు. ఎలాంటి ప్రభుత్వ ఉత్తర్వులు కానీ, జిల్లా కలెక్టర్ ఆదేశాలు కానీ లేకుండానే టీడీపీ నాయకుల సంతృప్తి కోసం గ్రామ సచివాలయాన్ని రైతుభరోసా కేంద్రం భవనంలోకి, అలాగే ఆ రైతుభరోసా కేంద్రాన్ని గ్రామ సచివాలయం భవనంలోకి అడ్డదిడ్డంగా మార్చేసిన వ్యవహారంపై తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే.

రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు...

వేపాడ మండలం బానాది గ్రామంలో బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అధికార టీడీపీలో ఓ వర్గం నాయకుల అండదండలతో చెలరేగిపోతున్న ఆ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి పేరు ఏవీఎస్ఎస్ మూర్తి. స్థానిక టీడీపీ నాయకుల సిఫారసుతో ఆయన బానాది గ్రామ సచివాలయానికి ఇన్‌చార్జి కార్యదర్శిగా పోస్టింగ్ తెచ్చుకున్నారు. గత ఏడు నెలల నుంచి జిల్లా అధికారుల ఆదేశాల కన్నా అక్కడ టీడీపీ నాయకుల రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని తూచా తప్పకుండా అమలుచేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకూ గ్రామసభ నిర్వహించలేదని, ఎప్పుడో ఒకసారి గ్రామ సచివాలయానికి వస్తారనీ, పంచాయతీ రికార్డులు ఎక్కడున్నాయో తెలియకుండా చేశారని, ఇదేమిటని ప్రశ్నిస్తే మద్యం తాగొచ్చి తమ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని మహిళా సర్పంచ్ కర్రి యశోద, వైస్ సర్పంచ్, వార్డు సభ్యులు గత ఏడాది అక్టోబరులో కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజాసమస్యల పరిష్కార వేదిక (స్పందన)లో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

జిల్లా అధికారులకూ ధిక్కారమే...

కలెక్టర్ ఆదేశాల మేరకు బానాది గ్రామంలో విచారణ నిమిత్తం వచ్చిన డీఎల్‌పీవో వద్ద కూడా మూర్తి అదే ధిక్కార ధోరణితో వ్యవహరించారు. దీంతో జిల్లా పంచాయతీ అధికారి ఆయనకు డిసిప్లెనరీ మెమో జారీ చేశారు. దీంతో ఆయన తీరు మారకపోగా సర్పంచ్, వార్డు సభ్యులకు వేధింపులు మరింత తీవ్రమయ్యాయి. పంచాయతీ రికార్డులు వారి కంటికి కనిపించకుండా చేసేశారు. చివరకు గ్రామ సచివాలయ భవనం నిర్మాణం కోసం సర్పంచ్ సొంత స్థలం ఇచ్చిన దానపట్టా, అందుకు సంబంధించిన తీర్మాన పత్రాలు కూడా మాయమైపోయాయి. దీంతో బాధిత మహిళా ప్రజాప్రతినిధులు గత డిసెంబర్ నెలలో కలెక్టరేట్‌లో మరోసారి ఫిర్యాదు చేశారు. ఇదంతా వివాదాస్పదమవుతున్న నేపథ్యంలో బానాది గ్రామ సచివాలయం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి మూర్తిని తప్పిస్తూ జిల్లా కలెక్టర్‌ఉత్తర్వులు జారీ చేశారు.

ఇక రెచ్చిపో అన్నట్లుగా...

సర్పంచ్ ఒక మహిళా ప్రజాప్రతినిధి అనే కనీస గౌరవం ఇవ్వకుండా గ్రామ సచివాలయం ఇన్‌చార్జి కార్యదర్శి మూర్తి చెలరేగిపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. తనకు ఎంపీ భరత్ అండగా ఉన్నారని, కలెక్టర్ కూడా తనను ఏమీ చేయలేరని అంతర్గతంగా కొంతమంది వద్ద వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్టు తెలిసింది.

వెనక్కి తగ్గిన కలెక్టరు...

మూర్తిని మళ్లీ బానాది గ్రామ సచివాలయానికి తెచ్చేందుకు టీడీపీలో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గమైన గొంప కృష్ణ, గొంప వెంకటరావు నేరుగా విశాఖ ఎంపీ భరత్ వద్దకు తీసుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకుల ఫిర్యాదుతోనే జిల్లా అధికారులు బానాది ఇన్‌చార్జి బాధ్యతల నుంచి మూర్తిని తప్పించారంటూ చెప్పించారు. అసలు విషయం తెలుసుకోకుండానే ఎంపీ భరత్ వెంటనే జిల్లా అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిసింది. దీంతో మూర్తిని ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను మళ్లీ తానే రద్దు చేస్తూ పునరుత్తర్వులు జిల్లా కలెక్టరు ఇవ్వాల్సి వచ్చింది.

జెడ్పీ చైర్మన్‌కు అభినందనలు



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిసి అభినందనలు చెబుతున్న విజయనగరం మండల ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

విజయనగరం రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు విజయనగరం మండల ఎంపీపీ, మామిడి అప్పలనాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు అభినందనలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనను చైర్మన్ చాంబర్‌లో కలిసి భీమిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. పార్టీ మరింత భాధ్యతను అప్పగించడంతో చైర్మన్‌కు అభినందనలు తెలపడంతో పాటు భీమిలి నియోజకవర్గానికి సంబంధించి పార్టీ కేడర్ పెంచడంలో తమ వంతు నిత్యం అందుబాటులో ఉంటూ మీతో పాటు ప్రయాణం చేస్తామని చైర్మన్‌కు వారు హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్మన్‌ను కలిసిన వారిలో రీమాపేట సర్పంచ్ హరీష్‌తో పాటు పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

పీఈటీల సేవలు అభినందనీయం



పీఈటీలను జ్ఞాపికలతో అభినందిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన స్టైపెండరీ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల నియామక ప్రక్రియలో పాల్గొన్న పీఈటీల సేవలను ఎస్పీ వకుల్ జిందల్ ప్రశంసించి వారిని అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఈ సందర్భంగా పీఈటీలకు జ్ఞాపికలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డిసెంబరు 30 నుంచి జనవరి 22 వరకూ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఎంటి, పీఈటీ పరీక్షలలో జిల్లా పరిషత్ పాఠశాలల్లో పీఈటీలుగా పనిచేస్తున్న వారి సేవలను వినియోగించుకున్నామన్నారు. అభ్యర్థులకు నిర్వహించిన 1600 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, 100 మీటర్ల పరుగు నిర్వహణలో కస్పా హైస్కూల్ పీఈటీగా పనిచేస్తున్న కె.గోపాల్, గంట్యాడ జెడ్పీహెచ్ స్కూల్‌లో పనిచేస్తున్న పీవీఎస్ఎన్.రాజు, చింతలపేట జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ కె.లక్ష్మణ, గాజులరేగ జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ పి.లీలాకృష్ణ, వీటీ అగ్రహారం జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ డి.ప్రవీణ్‌కుమార్ సేవలను వినియోగించుకున్నామన్నారు. 16 రోజుల పాటు ప్రతిరోజూ వేకువజామునుంచి పీఈటీలు సేవలందించారంటూ ప్రశంసించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ ఎవి.లీలారావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

హోమియో షాప్స్‌పై..

పర్యవేక్షణ కరువు..!



హోమియో మందులు

- ఆయుర్వేద షాప్స్‌పైన అదే పరిస్థితి
- మందులు కొనుగోలు చేస్తే బిల్లులు ఇవ్వని దుస్థితి
- జిల్లాలో 60 వరకు షాపులు

విజయనగరం ఫోర్ట్: విజయనగరం పట్టణానికి చెందిన ఎ.సురేష్ అనే వ్యక్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోమియో మందుల దుకాణంలో రూ.600 పెట్టి మందులు కొనుగోలు చేశాడు. మందుల కొనుగోలుకు సంబంధించి బిల్లు ఇవ్వాలని షాపు నిర్వాకుడిని అడిగితే హోమియో మందులకు బిల్లులు ఇవ్వబోమని చెప్పారు. దీంతో చేసేది లేక వెనుదిరిగాడు.

- గంట్యాడ మండలానికి చెందిన భవాని అనే మహిళ విజయనగరంలోని హోమియో దుకాణంలో రూ.400 పెట్టి మందులు కొనుగోలు చేసింది. ఆమె కూడా బిల్లు అడిగితే షాపు నిర్వాహకుడు ఇవ్వలేదు.

ఇలా వీరిద్దరికే కాదు. హోమియో , ఆయుర్వేద మందులు కొనుగోలు చేయడానికి వెళ్లే ప్రతి ఒక్కరికీ ఎదురువుతున్న పరిస్థితి. అల్లోపతి వైద్యంతో పాటు, హోమియో, ఆయుర్వేద వైద్యానికి కూడా చాలా మంది రోగులు వెళ్తున్నారు. దీంతో ఆయా విభాగాలకు చెందిన మెడికల్ షాపులు, క్లినిక్స్ వెలుస్తున్నాయి. ఆయితే ఆయా షాప్స్ నిర్వాహకులు బిల్లులు ఇవ్వడానికి ఇష్టపడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లులు చెల్లించినట్లయితే పన్ను చెల్లించాల్సి వస్తుందని బిల్లులు ఇవ్వడం లేదని తెలిసింది.

జిల్లాలో 60 నుంచి 80 వరకు షాపులు

జిల్లాలో 60 నుంచి 80 వరకు హోమియో, ఆయుర్వేద షాప్స్ ఎక్కువగా విజయనగరంలోనే ఉన్నాయి. అయితే ఈ దుకాణాలపై పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హోమియో, ఆయుర్వేద షాప్స్ పర్యవేక్షణ చేసే అధికారి రాష్ట్రం మొత్తానికి ఒక్కరే ఉండడంతో పర్యవేక్షణ పూర్తిస్థాయిలో జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో హోమియో,, ఆయుర్వేద షాప్స్ నిర్వాహకులు ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

మందుల నాణ్యతపైన అనుమానాలు

ప్రైవేటు హోమియో, ఆయుర్వేద షాప్స్, దుకాణాల్లో విక్రయించే మందుల నాణ్యతపైన పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వారు విక్రయించే మందులు నాణ్యమైనవో కాదో తెలియని పరిస్థితి. కొంతమంది నాణ్యత లేని మందులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మందులు కొంటే బిల్లు ఇవ్వాల్సిందే

హోమియో, ఆయుర్వేద మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లు ఇవ్వాలి. బిల్లు ఇవ్వనని అనడానికి లేదు. బిల్లు ఇవ్వనని అంటే లిఖిత పూర్వకంగా చేస్తే చర్యలు తీసుకుంటాం.

డాక్టర్ సుజాత,
అడిషనల్ డైరెక్టర్ , హోమియో శాఖ

జాబ్ మేళా రేపు

చీపురుపల్లి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఈనెల 25న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ, డెక్కన్ ఫైన్ కెమికల్స్ వంటి బహుళజాతి కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్మీడియట్, ఎంఫార్మసీ, బీఫార్మసీ, డీఫార్మసీ, డిగ్రీ, ఎంఎస్సీ ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని స్పష్టం చేశారు.ఆసక్తిగల వారు తమ వివరాలను జీఐటు//ఎస్‌జీఇఇడబ్ల్యు.ఎఐజౌర్.జీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్న ఈజాబ్‌మేళాకు అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్‌ఫోటోతో హాజరుకావాలని తెలిపారు. వివరాలకు 81069 23623, 99888 53335 నంబర్లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

27న జీఎంఆర్‌నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 27న ఉచిత స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ ఎం.రాజేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసుగల నిరుద్యోగ స్త్రీ, పురుషులు అర్హులని పేర్కొన్నారు. పురుషులకు కంప్యూటర్ డీటీపీ (45 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ (30 రోజులు), జెంట్స్ టైలరింగ్ (30 రోజులు), సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), అలాగే స్త్రీలకు లేడీస్ టైలరింగ్ (30 రోజులు), బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ (30 రోజులు), హోమ్ నర్సింగ్ (30 రోజుల పాటు)లలో శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో పాల్గొనాలని సూచించారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజన యూనివర్సిటీలో పీజీ కోర్సులకు నోటిఫికేషన్

- వీసీ ప్రొఫెసర్ కట్టిమణి



మాట్లాడుతున్న యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో వివిధ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. 2025-26 విద్యాసంవత్సరానికి గాను అందజేస్తున్న వివిధ పీజీ కోర్సుల ప్రవేశాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసిన నోటిఫికేషన్ వివరాలను ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి గురువారం ప్రకటించారు. డిగ్రీ పాసైన వారు, ఫైనల్ ఇయర్ పరీక్షలు రాసే వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, ఎమ్మే సోషియాలజీ, ఎమ్మే ఇంగ్లిష్, ఎమ్మే ట్రైబల్ స్టడీస్, ఎమ్మే జర్నలిజం/మాస్ కమ్యూనికేషన్స్, ఎమ్మే జాగ్రఫీ, ఎమ్మే ఎకనమిక్స్, ఎంబీఏ, ప్రోగ్రాంలలో ప్రవేశాలకు అవకాశం ఉందని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తున్న ఈ పరీక్షలలో అర్హులైన అభ్యర్థులకు మాత్రమే కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో చేరేందుకు అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఫీజులతో ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న ఈ ప్రవేశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశాలను ఎగ్జామ్స్. ఎన్‌టీఏ. ఏసీ.ఐఎన్/ సీయూఈటీ-పీజీ' వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కణపాకలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

- స్థల పరిశీలన చేసిన కలెక్టర్, ఎస్పీ



స్థల పరిశీలనలో కలెక్టర్, ఎస్పీ

విజయనగరం అర్బన్: కొత్తగా మంజూరైన అర్బన్ తహసీల్దార్ కార్యాలయం, 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌ల కోసం విజయనగరం పట్టణంలోని కణపాక ప్రాంతంలో గురువారం కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్ జిందల్ స్థల పరిశీలన చేశారు. సర్వే నంబర్ 15/1లో సుమారు ఎకరా స్థలాన్ని ఈ భవనాల నిర్మాణ కోసం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయానికి, మిగిలిన సగం పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి కేటాయించాలని అధికారులను ఆదేశించారు. వారివెంట రెవెన్యూ, పోలీసు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

జాతీయ క్రికెట్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలలో రాణించి బహుమతి సాధించిన క్రీడాజట్టు (ఫైల్)

భామిని: జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీలకు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా దివ్యాంగ క్రికెట్ జట్టు క్రీడాకారులు కేవటి శ్రీను(నేరడి-బి),బోనెల నరేష్(పాలకొండ)లు వారణాశిలో జరగనున్న జాతీయస్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.

వారణాశిలో ఫిబ్రవరి 16,17,18,19 తేదీల్లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించనున్నారు. గత ఏడాది డిసెంబర్ 8 నుంచి 11 వరకు విశాఖపట్నంలోని హిందూస్థాన్ జింక్ క్రికెట్ మైదానంలో రాష్ట్ర స్థాయి దివ్యాంగ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పాల్గొన్న 10 జిల్లాల జట్ల క్రీడాకారుల్లో జాతీయస్థాయికి అర్హులను గుర్తించిన ముగ్గురిలో ఇద్దరు పార్వతీపురం మన్యం జిల్లా వాసులు కావడం విశేషం.

వేసెక్టమీకి పురుషులు దూరం

- పదిశాతం కూడా ముందుకు రాని పరిస్థితి
- జిల్లాలో మూడేళ్లలో జరిగిన ట్యూబెక్టమీలు:6,152
- గత మూడేళ్లలో జరిగిన వేసెక్టమీ శస్త్ర చికిత్సలు:468
- అపోహల వల్లేనంటున్న నిపుణులు

పార్వతీపురం మన్యం జిల్లాలో గత మూడేళ్లలో కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స వివరాలు..

సంవత్సరం	వేసెక్టమీ	ట్యూబెక్టమీ
2022-23	208	2312
2023-24	176	2213
2024-25	84	1627
మొత్తం	468	6,152

వీరఘట్టం: వేసెక్టమీ...ఈ పేరు వింటేనే పురుషులు పరుగులు తీస్తున్నారు.ఒకప్పుడు కుటుంబ సంక్షేమ శస్త్ర చికిత్స చేయించుకోవడంలో మగవారు చెప్పుకోదగిన సంఖ్యలో ఉండేవారు. కొంతకాలం నుంచి పరిస్థితిలో మార్పు వచ్చింది.ఈ శస్త్ర చికిత్స చేయించుకునే బాధ్యత మహిళలదే అన్నట్లుగా మారిపోయింది. పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే వందమంది ట్యూబెక్టమీ ఆపరేషన్లు చేయించుకుంటే వేసెక్టమీ చేయించుకునే పురుషుల సంఖ్య కనీసం ఒక్క శాతం కూడా ఉండడం లేదు.

జిల్లాలో ఇదీ పరిస్థితి ..

పార్వతీపురం మన్యం జిల్లాలో 2022-23 లో 2,312 మంది మహిళలు ట్యూబెక్టమీ చేయించుకుంటే 208 మంది పురుషులు మాత్రమే వేసెక్టమీ చేయించుకున్నారు. అలాగే 2023-24లో 2,213 ట్యూబెక్టమీలు,176 వేసెక్టమీలు జరిగాయి. 2024-25 ఏడాదిలో ఇంతవరకు 1627 మందికి ట్యూబెక్టమీ చేయగా, కేవలం 84 మంది పురుషులు మాత్రమే వేసెక్టమీకి ముందుకొచ్చారు. వేసెక్టమీ చేయించుకునే వారు కేవలం విద్యావంతులే ఉంటున్నారు. అలా అని విద్యావంతులైన పురుషులూ అంత మందీ వేసెక్టమీకి ఆసక్తి చూపడం లేదు.ఏ కొద్ది మందో మాత్రమే మొగ్గు చూపుతున్నారు. అలాగే భార్య ఆరోగ్య పరిస్థితి క్షీణించి ఫ్యామిలీ ప్లానింగ్‌కు వీలుపడదనుకున్న వారు తప్పనిసరి పరిస్థితుల్లో వేసెక్టమీకి ముందుకొస్తున్నారు.

ఎందుకిలా..

వేసెక్టమీ చేయించుకుంటే పురుషులు శక్తి హీనులవుతారని, అందువల్ల పనులు సమర్థవంతంగా చేయలేరన్న అపోహ చాలామందిలో ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. విచిత్రమేమిటంటే తమ భర్తల కంటే తామే శస్త్ర చికిత్సలు చేయించుకుంటామని ముందుకొచ్చే మహిళలే ఎక్కువగా ఉంటున్నారని వారు అంటున్నారు. ఇదే అభిప్రాయం మహిళల్లోనూ ఉండడంతో ఆ బాధ్యత తమపై వేసుకుంటున్నారు. రానురాను ప్రసవానంతరం మహిళలే కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకోవడం రివాజుగా మారిపోయింది. ఈ వేసెక్టమీలపై అపోహలు తొలగించడానికి వైద్యారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది హరికథలు, బుర్రకథలు, వీధినాటకాలు వంటి వాటి ద్వారా ఎంత అవగాహన ప్రయత్నాలు చేస్తున్నా..వారి బుర్రకెక్కడం లేదు. పైగా మహిళల కంటే పురుషులకే కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సులభతరమని వైద్యులు చెబుతున్నారు.ఇప్పుడు కోత,కుట్లు అవసరం లేకుండానే సాంకేతిక పరిజ్ఞానంతో వేసెక్టమీ చేస్తున్నా ముందుకు రావడం లేదు.

అపోహల వల్లే

వేసెక్టమీ చేయించుకుంటే బలహీనులవుతామన్న అపోహ పురుషుల్లో బలంగా ఉంది. అందువల్లే మహిళలు ట్యూబెక్టమీలకు ముందుకొస్తున్నారు. వేసెక్టమీ చేయించుకున్న వారు పూర్తి ఆరోగ్యంగా ఉంటారు.ఎలాంటి సమస్యలు తలెత్తవు. ఈ విషయాన్ని సంబంధిత సెంటర్లు, ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, వైద్యాధికారులు స్పష్టంగా చెబుతున్నారు. ప్రస్తుతం అరకొరగానైనా వేసెక్టమీ చేయించుకుంటున్న వారిలో విద్యావంతులే ఉంటున్నారు.

డాక్టర్ ఎస్.భాస్కరరావు,
డీఎంహెచ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

సీఎస్ఆర్ నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

పార్వతీపురం: సామాజిక బాధ్యత నిధుల (సీఎస్ఆర్)కు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో సీఎస్ఆర్ నిధులకు సంబంధించి ప్రతిపాదనలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, అంగన్వాడీ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయం, ఉద్యానవన, జలవనరులు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పశుసంవర్ధకశాఖ, నైపుణ్య అభివృద్ధి సంస్థల పరిధిలో పనులు చేపట్టేందుకు, కొత్త ప్రాజెక్టులను చేపట్టేందుకు ఉన్న అవకాశాలపై నివేదికలు తయారు చేయాలని సూచించారు. సౌర విద్యుత్, కిచెన్ షెడ్లు, పాఠశాలలు, అంగన్వాడీలలో మరుగుదొడ్ల నిర్మాణం, వ్యవసాయ రంగంలో సోలార్ పంపుసెట్లు, పవర్ వీడర్లు, ఆయిల్ ఇంజిన్లు, వన్ ధన్ వికాస్ కేంద్రాలు బలోపేతం చేసేందుకు ఉన్న అవకాశాలపై ప్రతిపాదనలు తయారు చేయాలని పిలుపునిచ్చారు. సీఎస్ఆర్ నిధులకు అనుగుణంగా పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ, పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు, ఐసీడీఎస్ పీడీ టి.కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.